# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
గురువారం 12-06-2025




# ఈసారి బరిలో ఉందామా... వద్దా..!

- మల్ల గుల్లాలు పడుతున్న నాయకులు...
- ప్రత్యక్ష రాజకీయాల్లో నష్టపోతున్న వైనం
- ప్రజాసేవ పేరుతో ఆస్తుల తనఖా..?
- లక్షలు ఖర్చు పెట్టినా.. గ్యారంటీ లేదు
- ఖద్దర్ వెనక కన్నీటి గాధ...

**కోదాడ, జూన్ 9 (నినాదం):** రాజకీయం మోజు ఎన్నో జీవితాలను అతలాకుతలం చేస్తోంది. పదవులు రాని వాళ్లే కాదు, పదవులు అనుభవిస్తున్న వారూ ఇబ్బందుల్లో ఉన్నారు. హోదా, దర్పం కోసం స్థాయికి మించి ఖర్చులు పెడుతున్నారు. గ్రామ/పట్టణ, మండల, నియోజక వర్గ స్థాయి నాయకులు ఆఖరుకు జిల్లా స్థాయికి ఎదిగిన వాళ్లు సైతం చేస్తున్న ఖర్చులు గుదిబండగా మారుతున్నాయి. సర్పంచ్/కౌన్సిలర్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, సహకార సంఘాల చైర్మన్లు.. లాంటి పదవులతో పాటు చోటామోటా నామినేటెడ్ పదవులు దక్కించుకున్నవారు తాము సంపాదించేది ఏమోగానీ అడ్డగోలు ఖర్చులతో రోడ్డున పడుతున్నారు. రాజకీయాల్లో రాణించేది కొందరే. కానీ అందరూ ఆశలు పెట్టుకుంటారు. పదవుల మీద వ్యామోహంతో ఎన్నికల్లో తలపడి రూ. లక్షలు ఖర్చు చేస్తున్నారు. అయితే ఎన్నికల్లో ఓడిన వాళ్లే కాదు గెలిచిన వాళ్లు కూడా సంతోషంగా లేరని వాళ్ల ఆర్థిక స్థితిని చూస్తే స్పష్టమవుతోంది. రాజకీయాల్లో ఎదురుదెబ్బలు తిని నిలదొక్కుకున్నోళ్లు మాత్రమే ఆచితూచి ఖర్చు చేస్తున్నారు.

**కార్లకు లోన్లు ఇస్తున్నారని...**

రాజకీయంలో ఓ స్థాయికి ఎదిగి, డబ్బులు సంపాదించిన వారు కార్లు మెయింటేన్ చేసేవారు. కానీ ఇప్పుడు చోటా మోటా లీడర్లందరూ కార్లు కొనుగోలు చేస్తున్నారు. వాయిదాల పద్ధతిలో ఫైనాన్స్, బ్యాంకులు కార్లకు లోన్లు ఇస్తున్నాయి. దీంతో సర్పంచ్ నుంచి మొదలుకుని ఎంపీపీ, జడ్పీటీసీ వంటి పదవుల్లో ఉన్నవారు, ఓడిపోయిన వాళ్లూ, పార్టీ పదవుల్లో కొనసాగుతున్న వారు, నామినేటెడ్ పదవులు పొందిన వారు దాదాపు అందరూ కార్లు మెయింటేన్ చేస్తున్నారు. కారుకు ముందూ, వెనకాల పదవి, హోదా పేరుతో రేడియం స్టిక్కర్లు అంటించుకుని, స్టీరింగు ముందు తమ పార్టీ కండువాను పరచుకుని దర్పం ప్రదర్శిస్తుంటారు.

**గొప్పలకు పోయి...**

రాజకీయాల్లో తిరుగుతున్నవారు నలుగురి ముందు గొప్పగా ఉండేందుకు ప్రయత్నిస్తుంటారు. రోజూ కార్లలో తిరగడానికి పెట్రోల్, డీజిల్ కోసం తక్కువలో తక్కువరాజకీయాల్లో తిరుగుతున్నవారు నలుగురి ముందు గొప్పగా ఉండేందుకు ప్రయత్నిస్తుంటారు. రోజూ కార్లలో తిరగడానికి పెట్రోల్, డీజిల్ కోసం తక్కువలో తక్కువ రూ.వెయి వెచ్చించాల్సిందే. నలుగురిని వెంట వేసుకుని వెళ్లడంతో వారికి భోజనం, రాత్రికి ఇంత మందు సర్దాల్సిందే. కనీసం రోజు ఖర్చు ఎంత లేకున్నా రూ.2 వేల నుంచి రూ.3 వేలు ఖర్చు చేస్తారు. సరాసరిగా నెలలో వాళ్లు రూ. 40 వేల నుంచి రూ.50 వేల దాకా ఖర్చు చేస్తున్నారు. కొందరు అవసరముంటేనే కారు బయటకు తీ స్తుండగా మెజారిటీ లీడర్లు రోజూ కారులోనే షికా రు చేస్తుంటారు. కొందరు లీడర్లు పైరవీల మీద, మరికొందరు కాంట్రాక్టుల ద్వారా డబ్బులు సంపాదిస్తుంటారు. అవి కూడా అందరికీ కలిసిరావు.స్టార్చ్ వేసిన తెల్లటి ఖద్దరు చొక్కా.. కాళ్లకు ఖరీదైనబూట్లు.. తిరగడానికి కారు.. వెంటనలుగురు అనుచరులు.. జేబులో చిల్లిగవ్వ లేకున్నాపొలిటికల్ లీడర్లు ఇవన్నీ మెయింటేన్ చేయాల్సిందే...!ఎక్కడ చిన్న తేడా వచ్చినా సొంత పార్టీతో పాటు ప్రత్యర్థిపార్టీల నాయకుల ముందు చులకన అవుతామన్న భయం.అందుకే అప్పులు చేసైనా, ఆస్తులు అమ్మైనా సరే దర్పం ప్రదర్శిస్తుంటారు. అడ్డగోలు ఖర్చులతో అప్పులు కుప్పలై,ఆస్తులు హారతి కర్పూరంలా కరిగిపోయి ఎంతో మందినా యకులు రాజకీయాల నుంచి కనుమరుగవు తున్నారు. మరికొందరు అప్పులు తీర్చే మార్గం లేక, భవిష్యత్తుకానరాక ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. ఖద్దరు చొక్కా వెనుక కన్నీటి తడిఎంత ఉందో ఇటీవలి సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

**పొలాలు భూములు తనకా పెట్టి...** ఒక కౌన్సిలర్గా నిలబడాలంటే సుమారుగా 50 లక్షలకు పైన ఖర్చు అవుతుంది.. నిలబడ్డ ఇరువురు అభ్యర్థులకు అదే ఖర్చు కావడం ,ఎవరు గెలుస్తారో తెలియని పరిస్థితి. ఒకరు గెలిస్తే మరొకరికి నష్టమే... ఇక్కడ గెలిచిన అభ్యర్థి కూడా కేవలం ప్రెస్టేజ్ మీద గెలుస్తాడే తప్ప తెచ్చిన అప్పులు వెంటాడుతూనే ఉంటాయి... గడిచిన కోదాడ మున్సిపాలిటీ ఎన్నికలలో డబ్బు ఏరులై పారింది. నిలబడ్డ ఒక్కొక్క అభ్యర్థి అప్పులు తీసుకోవచ్చు మరి పోటీలో నిలబడాల్సిన పరిస్థితి. ఈసారి కూడా అదే పరిస్థితి ఉంటుందని రాజకీయ నిపుణులు హెచ్చరిస్తున్నారు... ఇదిలా ఉండగా గ్రామీణ ప్రాంతాలలో సర్పంచ్ , ఎంపీటీసీ ఎలక్షన్లకు ఇంకా గట్టి పోటీ ఉంటుంది. అప్పు తీసుకువచ్చి పొలాలు తనఖా పెట్టి మరి ఎలక్షన్లో నిలబడుతున్నారు. గెలిస్తే ఊపిరి పీల్చుకున్నట్టే.. కానీ ఓడితే మాత్రం ఊపిరి ఉన్న తెచ్చిన అప్పుల వడ్డీలతో చస్తూ బతకాల్సిందే.. గడిచిన సర్పంచ్ ఎంపీటీసీ ఎన్నికలలో అనంతగిరి మండలంలో ఓ తండాకు చెందిన యువకుడు సర్పంచ్ ఎలక్షన్ లో నిలబడి ప్రజాసేవ చేద్దామనుకున్నాడు కానీ తనకున్న పొలాన్ని తనకా పెట్టి మరి ఎన్నికల్లో నిలబడ్డ అదృష్టం వరించలేక ఓడిపోయాడు.. తదుపరి జరిగిన ఎంపీటీసీ ఎలక్షన్లలో సైతం గెలుస్తానేమో అని ఆశగా మళ్లీ అప్పు తీసుకొచ్చి నిలబడ్డ ఎంపీటీసీ ఎన్నికలలో సైతం ఓడిపోయాడు. దీంతో ఆ యువకుడు ఆర్థికంగా చిన్నా భిన్నమైపోయాడు. ఇప్పటికి కూడా ఆ యువకుడు ఆర్థిక పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది... ఇదే మండలంలో ఒక గ్రామానికి చెందిన ఇద్దరు నేతలు పోటీలో నిలబడి ఇరువురు భారీ స్థాయిలో నష్టపోయారు.

**కొంతమంది రాజకీయ నాయకుల వినూతనమైన ఆలోచన...**

అన్ని కోట్లు పెట్టి ఖద్దరు చొక్కను కాపాడుకునే బదులు.. అదే డబ్బును వ్యాపారంలో తిప్పితే లాభాలు వస్తాయని పలువురు రాజకీయ నాయకులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. అన్ని కోట్లు పెట్టినా జనాలు ఆధరిస్తారనే గ్యారంటీ లేదు. ఎందుకొచ్చిన తలనొప్పని ఆలోచనలో పడ్డారు. అందుకే పోటీ చెద్దామా వద్దా అని మల్లగుల్లాలు పడుతున్నారు..
దాని వెనుక దాగి ఉన్న గాథలు వింటే ఎవరికైనా అయ్యో అనిపించక తప్పదు. ప్రజాసేవ చేయాలన్న తపనతో కొందరు ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగులు పెడుతున్నప్పటికీ రాజకీయ మర్మం తెలియక పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోతున్నారు. కోట్ల రూపాయలు కూడబెట్టిన వారు లేకపోలేదు. కానీ దానికంటే ఆస్తులు పోగొట్టుకున్న వారే అధికం. అందుకే రాబోయే పంచాయతీ, ప్రాదేశిక ఎన్ని కల్లో చాలామంది బరిలో ఉందామా? వద్దా ...? అనే ఆలోచనలో ఉన్నారు.

# నాలల విస్తరణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలి

## పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం న్యూస్) :** నాలల విస్తరణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. బుధవారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని తార నగర్ కాలనీ లో గల సాయి బాబా దేవాలయం వద్ద రూ.28 కోట్ల 45 లక్షల రూపాయలతో నల్లగండ్ల చెరువు అలుగు నుండి బీహెచ్ఈఎల్ చౌరస్తా గ్యాస్ గో డౌన్ నాల వరకు ఆర్ సి సి బాక్స్ డ్రైన్ నిర్మాణం పనులను పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, ఎస్ ఎన్ డి పి విభాగం అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలల విస్తరణ పనులతో లోతట్టు, ముంపు ప్రాంతాలకు ఉపశమనం లభించిందని అన్నారు. ప్రజా అవసరాల దృష్ట్యా ప్రథమ ప్రధాన్యతలో విస్తరణ పనులు చేపట్టాలని, నాలల విస్తరణ పనులలో వేగం పెంచి యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించాలని అధికారులకు తెలియచేశారు. నాలల విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, నాలల విస్తరణ పనులు సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, ప్రధాన రహదారులపై పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని అన్నారు. అనంతరం నాల విస్తరణ పనులుపై అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎస్ ఎన్ డి పి అధికారులు ఏ ఈ నిఖిల, యుగేందర్, పవన్, టౌన్ ప్లానింగ్ అధికారులు డిప్యూటీ సిటీ ప్లానర్ తులసిరామ్, టిపిఎస్ జిషన్, టిపిఎస్ సంతోష్ నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కష్టమర్లకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

## మోకిలలో తుల్జా భవాని హెూటల్ ను ప్రారంభించిన: పామేన భీమ్ భరత్



**చేవెళ్ల జూన్ 11( నినాదం న్యూస్):**
కస్టమర్లకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని చేవెళ్ల నియోజకవర్గంలో చార్జర్ పామ్ అయిన భీమ్ భరత్ పేర్కొన్నారు.బుధవారంచేవెళ్ల నియోజకవర్గం శంకర్పల్లి మండల పరిధిలోని మోకిల గ్రామంలో బుధవారం తుల్జా భవాని హెూటల్ ను చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి. పామేన భీమ్ భరత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమ్ భరత్ మాట్లాడుతూ ఫుడ్ లవర్స్ కు మోకిల అడ్డాగా మారిందన్నారు. అద్భుతమైన రుచులతో అన్ని రకాల టిఫిన్స్ లను అందిస్తుందని చెప్పారు. హెూటల్ కు వచ్చే కస్టమర్లకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. హెూటల్ ను ఏర్పాటు చేసిన కిషన్ నాయక్కు భీమ్ భరత్ శుభాకాంక్షలు తెలిపారు. హెూటల్ ను ప్రారంభించిన భీమ్ భరత్ ను హెూటల్ యజమాని కిషన్ నాయక్ శాలువాతో ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు. హెూటల్ యజమాని కిషన్ నాయక్ మాట్లాడుతూ హైదరాబాద్, శంకర్పల్లి పట్టణాలకు సమీపంలో మోకిల ఉండటంతో పాటుగా ఈ ప్రాంతం నుంచి హైదరాబాదుకు తరచుగా విద్యార్థులు, వ్యాపారవేత్తలు ప్రయాణిస్తుంటారు. చుట్టుపక్కల ఉన్న వివిధ గ్రామాల ప్రజలు, ఆహార ప్రియులు తమ అభిమాన బిర్యానీని తమకు దగ్గర్లోనే ఆస్వాదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పెంటారెడ్డి, మోకిలా తండా మాజీ సర్పంచ్ నీలమ్మ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, దేవల నాయక్, అశోక్ నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## కేసారం వార్డులో మల్కాపూర్

# ఓటర్లను చేర్చొద్దు

### చేవెళ్ల ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన కేసారం గ్రామస్తులు

**చేవెళ్ల జూన్ 11(నినాదం న్యూస్):**
కేసారం వార్డులో మల్కాపూర్ ఓటర్లను చేర్చొదని కేసారం మాజీ సర్పంచ్ కేసారం రమేష్ అన్నారు. బుధవారం కేసారం మాజీ సర్పంచ్ రమేష్ ఆధ్వర్యంలో కేసారం వార్డులో మల్కాపూర్ ఓటర్లను చేర్చొదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కు గ్రామస్తులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చేవెళ్లకు కేసారం గ్రామం ఎన్నో ఏళ్లుగా అనుబంధ గ్రామంగా ఉందని, 2018లో కేసారం గ్రామం ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడిందన్నారు. 5 ఏళ్లు గ్రామ పంచాయతీగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నామని, ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన చేవెళ్ల మున్సిపాలిటీలో కేసారం గ్రామం విలీనమైందన్నారు. వార్డుల విభజనలో కేసారం గ్రామంలో 889 ఓట్లు ఉన్నాయని, 600 ఓట్లు మల్కాపూర్ వార్డు నుంచి తమ వార్డులో కలపొద్దని వేడుకున్నారు. కేసారం వార్డుకు తక్కువ పడే ఓట్లను చేవెళ్ల వార్డుల నుంచి తీసుకొని కేసారం ను వార్డుగా చేయాలన్నారు. తమ గ్రామ ప్రజలకు ఎన్నో ఏళ్లుగా చేవెళ్లకు అనుబంధం ఉందని, పని బాట వాళ్లు, ఇతర పనులు చేవెళ్ల నుంచి చేసుకుంటామని, తమను చేవెళ్ల వార్డులోనే విలీనం చేయాలని వేడుకున్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కాసుల సుధాకర్ గౌడ్, వెంకటేష్ గౌడ్, ఆశోక్ గౌడ్, రాజుగౌడ్, రవీందర్ గౌడ్, పెంటయ్య, కళ్లెంల శ్రీకాంత్, నరేందర్ గౌడ్, మహేందర్, శ్రీనివాస్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

## చేవెళ్ల పట్టణ ప్రాంతంలో సీసీ కెమెరాల

# ఏర్పాటుకు 16 లక్షల విరాళం

- నేరాల అదుపునకు సీసీ కెమెరాల పాత్రే కీలకం
- ఏసీపీ కిషన్ కు చెక్కును అందజేసిన,,మాజీ జెడ్పిటిసి మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి
- సురక్షిత సమాజ నిర్మాణం కోసం, మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి విరాళం, అమూల్యమైనది
- సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం అభినందనీయం: ఏసీపీ  కిషన్, సిఐ భూపాల్ శ్రీధర్

**చేవెళ్ల జూన్ 11(నినాదం న్యూస్):**
నేరాలను నియంత్రించడం, సీసీ పుటేజీల ద్వారా, నేరాలను నియంత్రించి, కేసులను ఛేదించడంలో సీసీ కెమెరాల పాత్ర అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని ఏసీపీ కిషన్, సీఐ భూపాల్ శ్రీధర్ పేర్కొన్నారు. ప్రజలకు శాంతియుతమైన వాతావరణాన్ని అందించేందుకు సామాజిక బాధ్యతగా అభివృద్ధిలో నేను సైతం అంటూ పోటీ పడుతూ,, పద్మావతి కన్వెన్షన్ హాల్ సహకారంతో చేవెళ్ల మాజీ జెడ్పిటిసి మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి సీసీ కెమెరాల ఏర్పాటుకు 16 లక్షల రూపాయల చెక్కును చేవెళ్ల ఏసిపి కిషన్, సీఐ భూపాల్ శ్రీధర్ కు అందజేశారు. చేవెళ్ల పట్టణ పరిసర ప్రాంతాలలో, చేవెళ్ల నుంచి హైదరాబాద్ వెళ్లే, జాతీయ రహదారి పై మల్కాపూర్ గేటు వరకు, వికారాబాద్ వైపు వెళ్ళు రహదారిపై దామరగిద్ద గేటు వరకు, చేవెళ్ల నుండి షాద్నగర్ వెళ్ళు రహదారిలో మల్లారెడ్డి కూడా గేటు వరకు, శంకర్పల్లి వెళ్లే దారి లో దేవుని ఎర్రవల్లి గేటు వరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, పోలీసులకు 16 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ నేపథ్యంలో చేవెళ్ల ఏసిపి కిషన్ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు 16 లక్షల రూపాయల చెక్కును




అందించడం అభినందనీయమని అన్నారు. సురక్షితమైన, సుసంఘటితమైన సమాజం కోసం సీసీ కెమెరాలు ముఖ్యమైనవని,ప్రజల భద్రత నేర నివారణలో ఇవి సహాయపడతాయని నేరాలను అరికట్టడం లో ప్రజలకు భద్రతను పెంపొందించడంలో సీసీ కెమెరాలు చాలా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, నేరస్తులను త్వరగా పట్టుకోవడంలో సీసీ పుట్టేజీలా ఆధారంగా నేరాలను అదుపు చేయవచ్చని అన్నారు. ఒక్కో సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి,. గుండాల రాములు,మల్లారెడ్డి గూడా మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, నత్తి కృష్ణ రెడ్డి వార్త వెంకటేష్, గణేష్ మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి. గండు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# శెట్టి బలిజ కులస్తుల ర్యాలీని ప్రారంభించిన

## పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం న్యూస్) :**
వై.ఎఫ్.సి.ఎ, టీఎస్ డబ్ల్యూ ఏ, వై.ఎఫ్.సి.ఎ రక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం వివిధ ఏరియా సంఘాల సారధ్యంలో ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషాముళ్లపూడి రోడ్డులో గల భవ్యాస్ తులసి వనం నుండి అధిక సంఖ్యలో బీసీ కమిషన్ ఆఫీస్ కు వెళ్లే ర్యాలీని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, రావుల శేషగిరిరావులతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా శెట్టి బలిజ కులస్తులు మాట్లాడుతూ మేము తొలగించిన 26o1 కులాలకు చెందిన వారము గత 11 ఏళ్లగా మమ్మల్ని పట్టించుకున్న నాధుడే కరువైన తరుణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బీసీ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశంతో బీసీ కమిషన్ పిలుపు మేరకు తెలంగాణలో బీసీ జాబితా నుంచి తొలగించిన 26 కులాల బాధితులమైన శెట్టిబలిజ సామాజిక వర్గం సభ్యులు వారి యొక్క గోడు బిసి కమిషన్ కు వినిపించుటకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శెట్టిబలిజ కులస్తులము తరలి వెళ్తున్నామని తెలిపారు. అధిక సంఖ్యలో వెళ్లడానికి వివిధ ఏరియా సంఘాలు తరలి వెళుతున్నామని శెట్టిబలిజ కులస్తులు తెలియచేసారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని కులలాను సమానంగా చూస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టి బలిజ కులస్తులు నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆకాశమే హద్దుగా విద్యార్థులు ప్రయత్నించాలి

- సమాజంలో విద్య ద్వారానే శాశ్వతమైన మార్పు, అభివృద్ధి సాధ్యం
- దేశ భవిష్యత్ విద్యార్థుల మీదనే ఆధారపడి ఉంటుంది
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**కోదాడ,జూన్ 11(నినాదం న్యూస్):** ఆకాశమే హద్దుగా విద్యార్థులు అవకాశాల కోసం ప్రయత్నించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో బడిబాట కార్యక్రమం పై సమీక్ష, 10వ తరగతిలో అత్యంత ప్రతిభ చూపెట్టిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లాకు చెందిన ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు జిల్లాలోని ఉన్నత స్థానాల్లో, రాష్ట్ర దేశ రాజకీయాల్లో ఉన్నత పదవుల్లో, వ్యాపారాల్లో, ప్రభుత్వ ఉద్యోగాలలో ఉండాలని దానికి ఏ సహాయం కావాలన్నా తన వంతు సహకారం అందిస్తానని కలెక్టర్ తెలిపారు. సూర్యాపేట జిల్లాలో బడి బయట ఒక్క విద్యార్థి కూడా లేకుండా అందరూ చదువుకోవాలన్నదే తన యొక్క సంకల్పం అని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని ఏప్రిల్ నెలలో ఉపాధ్యాయులు మొదలుపెట్టి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయటంలో ఎంతగానో కృషి చేశారని అన్నారు..ఆగస్టు 15 నాటికి జిల్లాలో విద్యార్థులందరికీ తెలుగు రాయటం చదవడం రావాలని దానికోసం ఉపాధ్యాయులు ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోనే సూర్యాపేట జిల్లా ఏప్రిల్ నెలలో బడిబాట కార్యక్రమం మొదలుపెట్టి ప్రైవేట్ స్కూల్స్ దీటుగా కొత్త అడ్మిషన్స్ నమోదు చేయడం జరిగిందని తెలిపారు. తిరుమలగిరి మండలంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో వచ్చిన టాపర్లను ర్యాలీ నిర్వహించి ఘనంగా సత్కరించడం జరిగిందని అలా చేయడంతో ప్రభుత్వ పాఠశాల ప్రాధాన్యత ప్రజలకు తెలుస్తుందని తెలిపారు.అంగన్వాడి స్కూల్ నుండి విద్యార్థులు ఐదు సంవత్సరాలు వచ్చిన తర్వాత తప్పనిసరిగా పాఠశాలలో నమోదయ్యేలా చూడాలని చదువుకునే పిల్లలు బడి బయట ఉండకుండా ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి కృషి చేయాలని సూచించారు.

జూన్ 12 నాడు పాఠశాల పునః ప్రారంభం ఒక పండుగ వాతావరణంలో జరపాలని విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు యూనిఫాం ఇచ్చేటప్పుడు గ్రామంలోని పెద్దలను,స్వయం సహాయక సంఘాల సభ్యులను, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యుల చేతులమీదుగా ఇప్పించాలని సూచించారు.60 రోజుల కార్యక్రమం ప్రణాళికలో భాగంగా జిల్లాలో ఎఫ్ ఎల్ ఎన్,ఎల్ ఐ పి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ప్రతి రోజు జిల్లా విద్యాధికారి,మండల విద్యాధికారి ఏదో ఒక పాఠశాల ప్రార్థనలో పాల్గొని పాఠశాలలో జరిగే కార్యక్రమాలను విద్యార్థులకు తెలియచేపరచాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించడం జరుగుతుందని తెలిపారు .ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత విద్య కొరకు ఎంపికైన పాఠశాలలో ఏఐ ల్యాబ్స్, కంప్యూటర్స్ త్వరగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం రెసిడెన్షియల్ హాస్టల్లో డైట్ మెనూ అనుసరించాలని వంటగదిలో గిన్నెలు పరిశుభ్రం చేయాలని నాణ్యమైన బియ్యమే వడ్డించాలని సూచించారు.జిల్లాలో మంచి ప్రతిభ చూపెట్టిన మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు 1,00,000 రూపాయలు, 90,000 రూపాయలు, 80,000 రూపాయలు అలాగే మండల పరిషత్ పాఠశాలకు 90,000 రూపాయలు,80,000 రూపాయలు,70,000 రూపాయల నిధులు మంజూరు చేస్తానని ఇట్టి నిధులను విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉపయోగించాలని సూచించారు.

జిల్లాలో పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని మొదటి ర్యాంకు సాధించిన టి జిఎంఎస్ కి ఇమంపేట కి చెందిన ఎం రుతిక రెడ్డి 15, 000,ఎం జె పి టి బి సి డబ్ల్యూ ఆర్ ఎస్ మద్దిరాల కు చెందిన సిహెచ్ స్నేహిత 12 వేల రూపాయలు, అలాగే తృతీయ ర్యాంకు సాధించిన టి జీ ఎం ఎస్ ఇమాంపేటకు చెందిన సిహెచ్ ఈశ్వర్ కు 10,000 రూపాయలు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం షీల్డ్, మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం గారి వింగ్స్ ఆఫ్ ఫైర్ అనే పుస్తకం విద్యార్థులకు బహుమతిగా ఇచ్చారు. అలాగే %గ్రానా%, కే జి బి వి, ఎస్ టి,ఎస్ సి, బిసి, మైనార్టీ, వెల్ఫేర్ రెసిడెన్సియల్ అలాగే ఎయిడెడ్ పాఠశాలలోని ప్రతి కేటగిరికి అలాగే ప్రతి మండలంలో మొదటి ర్యాంకు సాధించిన ప్రతి విద్యార్థికి 3000 రూపాయలు ద్వితీయ ర్యాంకు వచ్చిన విద్యార్థికి 2000 తృతీయ ర్యాంకు వచ్చిన విద్యార్థికి ?1000 నగదు తో పాటు స పత్రం షీల్డ్ వింగ్స్ ఆఫ్ ఫైర్ బుక్స్ కలెక్టర్ చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది.

ఈ నగదును మీ యొక్క ఉన్నత చదువుకే ఉపయోగించుకోవాలని వింగ్స్ ఆఫ్ ఫైర్ పుస్తకాన్ని మీరు కాలేజీలో చేరే నాటికి చదువుకోవాలని సూచించారు విద్యార్థులు ఇంత మంచిగా మార్పులు తెచ్చుకోవడానికి ప్రోత్సహించిన తల్లిదండ్రులకి విద్యార్థులకి ధన్యవాదములు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్,జిల్లా మైనార్టీ అధికారి జగదీశ్వర్ రెడ్డి, సంక్షేమ అధికారి నర్సింహారావు, కోఆర్డినేటర్లు జనార్దన్, శ్రవణ్ కుమార్,రాంబాబు,డిసిఓలు, ఆర్ సి ఓ లు,ఎంఈవోలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా వేట శివాజీ ముదిరాజ్

- నియామక పత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య



**కోదాడ (మునగాల),జూన్ 11(నినాదం న్యూస్):** మునగాల గ్రామానికి చెందిన వేట శివాజీ ముదిరాజ్ ను బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య నియామక పత్రం హైదరాబాదులోని తన కార్యాలయంలో అందజేశారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వేట శివాజీ మాట్లాడుతూ యువతరాన్ని ఉద్యమంలోకి తీసుకొని ఉద్యమ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. నా నియామకానికి సహకరించిన బీసీ విద్యార్థి సంఘం జాతీయ కోఆర్డినేటర్ డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ కు బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ కు ,బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో బుచ్చయ్య సురేష్ గౌడ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ బడిబాట



**మహాదేవపూర్, జూన్11 (నినాదం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో బుధవారంఅంగన్వాడి కార్యకర్తలు బడిబాటనిర్వహించారు పిల్లలను అంగన్వాడి సెంటర్లలో చేర్పించాలని వారికి పోషక విలువలు అందజేసే విధంగా చూసుకుంటామని అంగన్వాడి కార్యకర్తలు పిల్లల తల్లిదండ్రులకు వివరించారు.అనంతరం అంగన్వాడి సెంటర్ లలో ఎగ్ బిర్యానీ చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లులు పిల్లల పోషణ అభియాన్ స్వప్న, అంగన్వాడీ కార్యకర్తలు సత్యవాణి, సుజాత, ఆయాలు లక్ష్మి, వెంకటమ్మ లు పాల్గొన్నారు.

# రాజరాజేశ్వర దేవాలయ అభివృద్ధికి సహకరిస్తా

- రూ.10,116 విరాళం చెక్కును సభ్యులకు అందజేసిన ప్రభు



**జమ్మికుంట, జూన్ 11 (నినాదం న్యూస్) :** గత ఐదు వందల సంవత్సరాల క్రితం నిర్మించిన శివాలయం శిథిలం కావడంతో జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామం పెద్దలు శ్రీ రాజరాజేశ్వర దేవాలయ అభివృద్ధి కమిటీ ని ఏర్పాటు చేసుకొని శిథిలమైన శివాలయాన్ని తొలగించి పునః ప్రారంభించడానికి ముందుకు వచ్చి దాతల సహాయంతో అభివృద్ధి చేయడంలో భాగంగా మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల ప్రభాకర్ (ప్రభు) జమ్మికుంట లోని తమ నివాసంలో బుధవారం రూ : 10,116 చెక్కును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వ మతాల కలయికనే నా భారతదేశం అంటూ అన్ని కుల,మతాలను గౌరవిస్తూ సోదర భావంతో కలిసి మెలిసి ఉండాలని తమ గ్రామంలో శివాలయం పునః నిర్మాణం కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ నిర్మాణం పూర్తయ్యే వరకు భాగస్వామ్యం అవుతానని దేవాలయ అభివృద్ధికి తోడ్పడ తానని అన్నారు. మడిపల్లి స్వగ్రామంలో జన్మించిన అంబాల ప్రభాకర్ తమ గ్రామ అభివృద్ధి కి ఎంత చేసిన తక్కువనేనని అన్నారు. దేవాలయ అభివృద్ధికి తోడ్పడుతూ మడిపల్లి గ్రామం రుణం తీర్చుకుంటున్నానని అన్నారు. అదే మడిపల్లి గ్రామంలోనీ ప్రజలు, నాయకులు, ఉద్యోగ ఉపాధ్యాయులే, కాకుండా జమ్మికుంట పట్టణంలోని అధికారులు , వ్యాపారులు, రాజకీయ నాయకులు దేవాలయ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులను అభినందించారు. అదే విధంగా జమ్మికుంట (కొత్తపల్లి)చెందిన మెకానిక్ రాంపల్లి మధు దేవాలయాల అభివృద్ధికి రూ: 10,116 విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు పోసిన సత్యనారాయణ, కస్తూరి రాములు, గుర్రాల మల్లారెడ్డి, పసరగొండ సదానందం, అనిల్ తదితలు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- రాచకొండ సీపీ సుధీర్ బాబు



**కాప్రా, జూన్ 11 (నినాదం న్యూస్):** శాంతి భద్రతల పరిరక్షణ కోసం అధికారులు శక్తివంచన లేకుండా పని చేయాలని రాచకొండ సీపీ జి. సుధీర్ బాబు సూచించారు.ఘట్కేసర్ పీఎస్ , కేపాల్ చెక్ పోస్ట్ లను సందర్శించి పోలీసింగ్ కార్యకలాపాలను బుధవారం సమీక్షించారు. ఈ సందర్శనలో, సీపీ రాచకొండ స్టేషన్ ప్రాంగణాన్ని తనిఖీ చేసి, కేసు డైరీ ఫైళ్లను పరిశీలించారు. కొనసాగుతున్న దర్యాప్తు పురోగతిని అంచనా వేశారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ పాటించడం , దర్యాప్తు ప్రక్రియలను వేగవంతం చేయాలని కోరారు. దర్యాప్తు అధికారులకు విలువైన మార్గదర్శకత్వం అందించారు. నేరారోపణ రేటును మెరుగుపరచడం బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాల్సిన అవసరాన్ని కమిషనర్ వివరించారు. సమర్థవంతమైన, జవాబుదారీ పోలీసింగ్ పట్ల రాచకొండ పోలీసుల నిబద్ధతను బలోపేతం చేయాలని కోరారు.

# విద్యార్థులకు న్యాణ్యత విద్యను అందించాలి

- ప్రభుత్వ పాఠశాల, కాలేజీలలో సౌకర్యాలు కల్పించాలి
- రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా
- రాష్ట్ర అధ్యక్షులు కుతాడి శివరాజ్ డిమాండ్



**కరీంనగర్, జూన్ 11(నినాదం న్యూస్) :** రాష్ట్రంలో ఎక్కడ చూసినా ప్రైవేటు పాఠశాలలు. ప్రైవేటు కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని. ప్రైవేటు పాఠశాల కళాశాలలో ఎలాంటి సౌకర్యాలు లేకుండా నిర్వహిస్తున్నారని. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేయించి ప్రైవేట్ పాఠశాల కళాశాల యజమానియాలపై చర్య తీసుకురావాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలలో ఎలాంటి సౌకర్యాలు లేవని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో సౌకర్యాలు కల్పించాలని. నాణ్యత చదువు అందించాలని డిమాండ్ చేశారు. నిరుపేదల కోసం విద్య హక్కు చట్టాన్ని తీసుకొని వచ్చి ఇన్ని రోజులైనా కూడా ఏ ప్రైవేట్ పాఠశాలల్లో కళాశాలల్లో అమలు కావడంలేదనిలి వెంటనే విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చి. ప్రవేట్ పాఠశాలలు. కళాశాలలో విద్యార్థి తల్లిదండ్రుల నుండి అధిక డబ్బులు గుంజుతున్నారని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ అధికారులతో విచారణ చేయించాలని., విద్యా శాఖ మంత్రిని ఏర్పాటు చేసి రాష్ట్రంలో విద్యను అభివృద్ధి చేయించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో:రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుకూరి శ్రీనివాస్. రాష్ట్ర మహిళా ఉపాధ్యాయురాలు మొగురం మీరియా.కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కాశిపాక అజయ్. కరీంనగర్ నగర అధ్యక్షురాలు జీ.స్వాతి. మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షురాలు కే.కవిత. రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షురాలు బైరి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన జన సమితి పోస్టర్ విడుదల

- జీజేఎస్ పోస్టర్ విడుదల చేసిన మాజీ మంత్రి రవీందర్ నాయక్



**మహేశ్వరం జూన్ 11 (నినాదం న్యూస్):** గిరిజన జన సమితి 4వ ఆవిర్భావ సభ పోస్టర్ విడుదల చేసిన మాజీ మంత్రి మాజీ ఎంపీ ధారావత్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ, గిరిజన జన సమితి వ్యవస్థాపకుడు రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ నాయక్ తమ్ముడు చిన్న వయసులో జాతికోసం తనవంతు పోరాటం చేస్తున్నాడు ఇలాగే ముందుకు పోవాలని దీవించారు. కార్యక్రమంలో పాల్గొన్న భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్ నాయకుల తో కలిసి నడిగడ్డ తండా అధ్యక్షులు అల్వార్ స్వామి, మహేశ్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## బాల కార్మిక నిర్మూల దినోత్సవం

- పోస్టర్ ఆవిష్కరించిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ మల్కాజిగిరి, జూన్11(నినాదం న్యూస్):** బాల కార్మిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు చేతుల మీదుగా గోడ పత్రిక పోస్టర్ని రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో మన జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా విద్యాశాఖ విద్యాశాఖ అధికారి, విజయకుమారి జిల్లా సంక్షేమ అధికారి శారద, బాల రక్షక భవన్ కోఆర్డినేటర్ తిరుమలాదేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియాజ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రేణుక , అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి సిబ్బంది ప్రత్యేక దత్తత ఏజెన్సీ మేనేజర్ అరుణ్ జంజల్, సతీష్ యొక్క కార్యక్రమంలో పాల్గొని మరి పోస్టర్ రిలీజ్ జరిగింది.



## భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

- రిమాండ్‌కు తరలించిన పోలీసులు



**జవహర్ నగర్, జూన్ 11 (నినాదం న్యూస్):** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్మిక నగర్లో అనుమానమే పెనుభూతమై కోపం పెంచుకున్న భర్త పని ముగించుకొని ఇంటికి వెళ్తుండగా దారి కాచి మంగళవారం రాడుతో కొట్టడంతో తీవ్ర గాయాల పాలైన భార్య సౌందర్య మరణించిన సంగతి విధితమే. ఈ సంఘటనలో నిందితుడు భాష మాల అశోక్ ని బుధవారం జవహర్ నగర్ పోలీసులు అరెస్టు చేశారు. అయితే తన భార్య సౌందర్య (సోనీ) తన పైన పోలీసు కేసులు పెట్టి జైలుకు పంపిందన్న కోపంతో, తన భార్య అక్రమ సంబంధం ఏర్పరచుకుందన్న అనుమానంతోనే కాపు కాచి దమ్మైగూడ నుంచి వస్తున్న భార్యను కృపాసన చర్చి దగ్గర తనతో పాటు తెచ్చుకున్న రాడ్డుతో తలపై కొట్టి చంపాడని నిందితుడు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితున్ని కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలించామని పోలీసులు తెలిపారు.

# ట్రాక్టర్ రోటవేటర్‌లో పడి బాలిక మృతి

- తంగడపల్లి గ్రామంలో ఓ ఫామ్ హౌస్ లో ఘటన





**చేవెళ్ల జూన్11 (నినాదం న్యూస్):** ప్రమాదవ శాత్తు ట్రాక్టర్ రోటవేటర్ లో పడి 11 ఏళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయిన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన మంగలి సంజీవ్ కుమార్, తండ్రి అనంతయ్య, వయసు 34 సంవత్సరాలు, వృత్తి బార్బర్, వికారాబాద్ పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ, తన కుటుంబంతో కలిసి చేవెళ్ల మండలంలోని తంగడపల్లిలో ఉన్న తన భార్య అక్క అయిన పద్మ నివాసానికి మంగళవారం రోజున మధ్యాహ్నం సమయానికి వచ్చారు. బుధవారం 11-06-2025 న ఉదయం 9 గంటల సమయంలో అట్టి ఫామ్ హౌస్ లోని మామిడి తోటలో గల గడ్డిని తొలగించేం దుకు పద్మ భర్త సుశీల్ కుమార్ ట్రాక్టర్ ను రొటావేటర్ (నంబర్ TS-07-JP-2562) సహాయంతో దున్నుతున్నాడు. ఆ సమయంలో ఎవరు పనులు వాళ్ళు నిమగ్నమై ఉండగా, కూతురు అయిన అక్షిత (వయసు 11 సంవత్సరాలు, విద్యార్థి) మామిడి తోటలో ఆడుకుంటూ ప్రమా దవశాత్తు ట్రాక్టర్ రోటవేటర్‌లో ఇరుక్కొని తీవ్రంగా గాయపడింది.దీనిని గమనించిన కుటుంబికులు చిన్నారి అక్షితను చెవెళ్లలోని ఆసుపత్రికి తరలించారు అయితే వైద్యులు ఆ చిన్నారిని పరీక్షించి ఆమె అప్పటికే మరణించిందని ధృవీకరించారు. పోలీసులు ఇట్టి విషయంపై కేస్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు.

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
గురువారం, తెలంగాణ
12 జూన్ 2025

## మంత్రిని కలిసిన చెన్నూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు



చెన్నూర్ జూన్ 11 (నినాదం న్యూస్): చెన్నూర్ శాసన సభ్యులు రాష్ట్ర మంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన శుభ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్మిక, క్రీడల, న్యాయశాఖ మంత్రి వర్యులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో నియమితులైన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి గారికి హైదరాబాదులో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియ జేసిన చెన్నూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు..

## ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను కలిసిన యూత్ కాంగ్రెస్ నేతలు

జమ్మికుంట, జూన్ 11 (నినాదం న్యూస్) ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



కు టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన జమ్మికుంట యూత్ కాంగ్రెస్ నాయకులు. ఈ సందర్భంగా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చిన్నాల శ్రీకాంత్ కార్యదర్శి ఉమ్మడి సందీప్ ఎన్ ఎస్ యు ఐ జమ్మికుంట పట్టణ అధ్యక్షులు బిసాడి వంశీ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుండి ఎన్నో ఉద్యమాలు చేసి విద్యా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించిన ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షులు ప్రస్తుత ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కు టిపిసిసి ఉపాధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం నియమించడం సంతోషంగా ఉందని అన్నారు. రాబోయే రోజుల్లో వెంకట్ మరిన్ని ఉన్నతమైన పదవులు పొంది ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు.

## టీపీసీసీ నూతన ఉపాధ్యక్షునికి అభినందనలు తెలిపిన నాయకులు



నాచారం, జూన్ 11 ( నినాదం న్యూస్ ) : ఉప్పల్ నియోజకవర్గ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు టీపీసీసీ ఉపాధ్యక్షులుగా నియమితులైన బొంతు రామ్మోహన్ ని కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి, రామంత పూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గిరిబాబు, జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, ప్రకాష్, నరసింహ, సాయి నితీష్, రాజేష్, కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఏ బ్లాక్ జనరల్ సెక్రెటరీ సుర్వి మురళి గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బౌరంపేట కృష్ణ , మాజీ నేషనల్ యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ వినోద్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విశ్వకర్మ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు పబ్బోజు బిక్షపతి చారి తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు టోకెన్ ద్వారా ఇసుక సరఫరా

**ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవు: కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, జూన్ 11 (నినాదం న్యూస్)** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేందుకు టోకెన్ పద్ధతి ప్రవేశపెట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మైనింగ్, రెవెన్యూ, గృహ నిర్మాణ సంస్థ, ఇంజనీరింగ్ అధికారులతో వివిధ రకాల ప్రభుత్వ భవనాలు, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా విధానంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరుతో ఇసుక అక్రమ రవాణా నిర్మూలించేందుకు టోకెన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాతో టోకెన్ల జారీ విధానంపై ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను మ్యాపింగ్ చేయాలని సూచించారు. లబ్ధిదారుని గృహ నిర్మాణ అవసరాన్ని బట్టి టోకెన్లు జారీ చేయాలని తెలిపారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, ఏఈలు ఇసుక టోకెన్ల జారీని చేపట్టాలన్నారు. ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తున్న ఇసుకపై



నిఘా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు మైనింగ్ శాఖ ఏడి రాఘవ రెడ్డి, హౌసింగ్ పిడి గంగాధర్, పలు విభాగాల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



## హెూటల్ నక్షత్రను ప్రారంభించిన బండారి లక్ష్మారెడ్డి

**నాచారం, జూన్ 11 ( నినాదం న్యూస్ ) :** మల్లాపూర్ డివిజన్ పరిధి లోని గ్రీన్ హిల్స్ కాలనీ నందు నూతనంగా ఏర్పాటు చేసిన హెూటల్ నక్షత్ర ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలసి ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నిర్వాహకులకు శు భాకాంక్షలు తెలిపారు. వ్యాపారరంగంలో రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్యాన్ని కోల్పోతున్న బాలలు

**బడి గంట మ్రోగుతున్న వేళ, ఆటపాటల్లో మునిగి తేలాల్సిన సమయం, ఆశలతో కళ్ళు మెరవాల్సిన చిన్నారి ప్రపంచం ఇవేవీ లక్షలాది భారతీయ చిన్నారుల జీవితాల్లో లేవు. వారి లేత చేతులు నిత్యం ఏదో ఒక పనిలో నిమగ్నమై, మోముపై చిరునవ్వుకు బదులు అలసటను మోస్తున్నాయి. భారతదేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సామాజిక సవాళ్లలో బాలకార్మిక వ్యవస్థ ఒకటి. పేదరికం, నిరక్షరాస్యత, కట్టుబాట్లు, చౌక శ్రామికుల కోసం ఎగబడే మారీచ స్వభావం -ఈ అంశాలన్నీ కలిసి మన పిల్లల భవిష్యత్తును చీకట్లోకి నెడుతున్నాయి. ఈ సమస్యను కేవలం చూసి సరిపుచ్చుకోకూడదు. దీనిని వేళ్ళతో సహా పెకిలించి, మన చిన్నారుల ముఖాలపై నిజమైన చిరునవ్వులు పూయించడానికి పటిష్టమైన, నిరంతర, సానుభూతితో కూడిన విధానం అత్యవసరం.**

బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం:
బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం అంతర్జాతీయ కార్మిక సంస్థ 2002 సంవత్సరంలో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని జూన్ 12 గా నిర్ణయించింది. ఈ ఏడాది " పురోగతి స్పష్టంగా ఉంది, కానీ ఇంకా ఎక్కువ పని చేయాల్సి ఉంది: ప్రయత్నాలను వేగవంతం చేద్దాం! " అనే ఇతివృత్తాన్ని తీసుకున్నారు. బాలకార్మికుల వ్యవస్థ అంతానికి తీసుకోవలసిన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ రోజు ప్రధాన లక్ష్యం.

బాలకార్మికులు అంటే ఎవరు?
కొన్ని దేశాలలో 5 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు, ఇంకొన్ని దేశాలు 5 నుండి 18 సంవత్సరాల మధ్యలో ఉన్న వారిని బాలలుగా పరిగణిస్తాయి. బాల్యాన్ని నాశనం చేసే రీతిలో బాలల శారీరక, మానసిక అభివృద్ధికి ఆటంకమై కనీస అక్షరాస్యతను, వినోదాన్ని కూడా పొందని వారిని బాలకార్మికులని అంటారు. ఈ బాలకార్మిక వ్యవస్థ ప్రపంచ దేశాల అభివృద్ధికి ఆటంకాలను కలిగిస్తుంది.

గణాంకాల మాట- అంకెల్లో ఆవేదన:
నిజం చెప్పాలంటే 2011 జనాభా లెక్కల ప్రకారం 5 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల 10.1 మిలియన్లకు పైగా పిల్లలు పని చేస్తున్నారని గణాంకాలు గట్టిగా చాటి చెబుతున్నాయి. ఇది మొత్తం పిల్లల జనాభాలో దాదాపు 4% కావడం ఎంతగానో ఆందోళన కలిగిస్తుంది. 2001 నుండి 2011 మధ్య కాలంలో బాల కార్మికుల సంఖ్య 2.6 మిలియన్లు తగ్గింది అన్నది కొంత ఊరట కలిగించినా ఈ సానుకూల ధోరణి ఎక్కువగా గ్రామ ప్రాంతాలకే పరిమితమైంది. ఆందోళనకరంగా, పట్టణ ప్రాంతాలలో బాల కార్మికుల సంఖ్య పెరిగింది. ఇది పట్టణాలలో చౌకైన, దోపిడీకి గురయ్యే శ్రామికుల పట్ల పెరుగుతున్న డిమాండ్‌ను స్పష్టంగా సూచిస్తుంది. ఇక ఇటీవల యూమివెఫ్ విశ్లేషణలు (2018-19 పిఎల్ఎఫ్ఎస్డే డేటా ఆధారంగా) ఒక లక్షా యాభై వేల నుండి మూడు లక్షల ముప్పై మూడు వేల మంది పిల్లలు బాల కార్మికులుగా ఉన్నారని వారిలో దాదాపు సగం మంది తమ సొంత కుటుంబాలలోనే పని చేస్తున్నారని వెల్లడించాయి. దీనివల్ల వారిని గుర్తించడం, సహాయం అందించడం మరింత కష్టమవుతోంది. వ్యవసాయం, ఇటుక బట్టీలు, తివాచీలు నేయడం, వస్త్ర పరిశ్రమలు, గృహ సేవ వంటి ప్రమాదకర రంగాలలో అత్యంత బలహీన వర్గాలకు చెందిన చిన్నారులు తరచుగా కష్టపడుతున్నారు. ఇవి తరచుగా బహిరంగ దృష్టికి, ఎలాంటి నియంత్రణకు దూరంగా ఉంటాయి.

అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రపంచవ్యాప్తంగా 16 కోట్ల బాలకార్మికులు ఉన్నారనీ చెబుతోంది. వారిలో 6.3 కోట్లు బాలికలు కాగా, 9.7 కోట్లు బాలురు. వీరిలో 7.9 కోట్లు మంది అత్యంత ప్రమాదకరమైన పరిశ్రమలలో పనిచేస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలోని ప్రతి పది మంది బాలకార్మికులలో తొమ్మిది మంది ఆఫ్రికా, ఆసియా, పసిఫిక్ ప్రాంతాలలోనే ఉన్నారు. అత్యధికంగా 8.66 కోట్ల మంది సబ్ సహారాన్ ఆఫ్రికా ప్రాంతంలో నమోదయ్యారు. ఈ బాల కార్మికులలో 70 శాతం మంది వ్యవసాయ రంగంలో, 20 శాతం మంది సేవా రంగంలో, 10 శాతం మంది ఇతర పరిశ్రమలలో పనిచేస్తున్నారు. ఆశ్చర్యకరంగా, గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో బాల కార్మికుల సంఖ్య మూడు రెట్లు ఎక్కువగా ఉంది.

నిస్సహాయతతో కూడుకున్న అవసరం:
పిల్లలు పనిలోకి ఎందుకు నెట్టివేయబడుతున్నారు? అని ప్రశ్నించుకుంటే వచ్చే సమాధానాలు అనేకం. ప్రధాన కారణం మాత్రం పేదరికమే! సమాజంలో అట్టడుగున ఉన్న లక్షలాది కుటుంబాలకు, పిల్లలు సంపాదించే చిన్న మొత్తం కూడా, అది ఎంత తక్కువైనా, కుటుంబానికి జీవనాధారం. ఇది తల్లిదండ్రులు ఇష్టపడి తీసుకునే నిర్ణయం కాదు. కేవలం నిస్సహాయతతో కూడుకున్న అవసరం. కుటుంబాలు కడుపు నింపుకోవడానికే అష్టకష్టాలు పడుతున్నప్పుడు, విద్య అనేది వారికి అందుబాటులో లేని ఒక విలాసంగా మారుతుంది. ఇది రెండవ కీలకమైన కారణానికి దారితీస్తుంది. నాణ్యమైన విద్య అందుబాటులో



లేకపోవడం. అనేక మారుమూల గ్రామాలలో సరైన పాఠశాలలు లేవు. పట్టణ ప్రాంతాలలో కూడా రద్దీగా ఉండే తరగతి గదులు, తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడం, ఆసక్తి లేని పాఠ్య ప్రణాళికలు పిల్లలను విద్యా వ్యవస్థ నుండి బయటకు నెట్టివేసి పనిలోకి దించుతాయి. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఒక ప్రత్యేక లక్షణమైన అసంఘటిత రంగం వేగంగా వృద్ధి చెందడం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. చిన్న వర్క్‌షాప్‌లు, వీధి వ్యాపారులు, గృహ ఆధారిత పరిశ్రమలను కలిగి ఉన్న ఈ విస్తారమైన, నియంత్రణ లేని రంగం కార్మిక చట్టాల పరిధికి దూరంగా పనిచేస్తుంది. పిల్లలను ఇక్కడ పనిలోకి తీసుకుంటారు ఎందుకంటే వారు చౌకగా దొరుకుతారు, చెప్పిన పని చేస్తారు, ఫిర్యాదు చేసే అవకాశం తక్కువగా ఉంటుంది. ఇది నేరస్థులను గుర్తించడం, శిక్షించడం చాలా కష్టతరం చేస్తుంది. అంతేకాకుండా బాల కార్మికుల వల్ల కలిగే తీవ్రమైన శారీరక, మానసిక పరిణామాలపై తల్లిదండ్రులు, సమాజంలో విస్తృతంగా ఉన్న అవగాహన లేమి, కొన్నిసార్లు చిన్న వయస్సులోనే పనిలోకి వెళ్లడాన్ని సాధారణంగా భావించే సామాజిక కట్టుబాట్లు, సాంస్కృతిక విశ్వాసాలు ఈ దుష్టచక్రాన్ని మరింత పటిష్టం చేస్తాయి. కులం, లింగం, మతం ఆధారంగా వివక్ష కూడా కొన్ని వర్గాల పిల్లలను దోపిడీకి మరింత గురిచేస్తుంది.

చరిత్ర అద్దంలో బాలకార్మికులు: నాడు-నేడు:
బాలకార్మిక సమస్య అనేది కొత్తది కాదు. చరిత్రను పరిశీలిస్తే 16, 17వ శతాబ్దాల నాటికే ఈ సమస్య ఉందని తెలుస్తుంది. ఆనాడు పేద దేశాలలోని ప్రజలు తమ ఆర్థిక అవసరాల కోసం తమ పిల్లలను ఇతరులకు అమ్మివేసేవారు. అలాంటి బానిసలందరూ బాలకార్మికులే. పారిశ్రామిక విప్లవం తరువాత కర్మాగారాలలో పెద్దల కంటే తక్కువ వేతనానికే పిల్లలు లభించడం వలన వీరి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆ తర్వాత అన్ని రంగాలలో బాలకార్మికులు పెరుగుతూ వచ్చారు. నేటి కాలంలో కూడా బాలకార్మిక సమస్యకు ప్రధాన కారణం పేదరికం మాత్రమే. కోవిడ్ మహమ్మారి అనంతర ఆర్థిక అవసరాలు పెరగడం, పాఠశాలలు మూసివేయబడటం, కుటుంబ పెద్దలు ఉపాధి కోల్పోవడం, వ్యాపారంలో నష్టాలు, తల్లిదండ్రుల మరణాలు, యుద్ధాలు (ఉదాహరణకు రష్యా-ఉక్రెయిన్, పాలస్తీనా-ఇజ్రాయిల్), ప్రకృతి వైపరీత్యాలు వంటివి బాలకార్మికుల సంఖ్య వృద్ధికి ప్రధాన కారణాలు. రష్యా-ఉక్రెయిన్, పాలస్తీనా -ఇజ్రాయిల్ యుద్ధాలు ఎన్నో పాఠశాలలు మూతపడటానికి, లక్షలాది మంది ప్రజలు తమ నివాసాలను వదిలి వెళ్లడానికి దారితీశాయి. చాలా మంది పిల్లలు తల్లిదండ్రులను కోల్పోయారు. వీరందరూ బ్రతుకుతెరువు కోసం తప్పకుండా ఏదో ఒక పని చేయవలసిందే. విచారకరంగా, వీరందరూ రేపటి బాలకార్మికులే! ఐఎల్ఓ అంచనాల ప్రకారం 2023 చివరినాటికి బాలకార్మికుల శాతం మరింత పెరుగుతుందని తెలిపింది. నేడు బాలకార్మికులు ఎక్కువగా వ్యవసాయరంగం, గృహసంబంధ పనులు, బాణాసంచా, వస్త్ర, బొమ్మలు, గొడుగుల తయారీ, గనులు, మైనింగ్ వంటి ప్రమాదకర రంగాలలో అధికంగా ఉన్నారు. ఇంకా పాడి, మత్స్య, అటవీ, రిటైల్ రంగాలలో, రెస్టారెంట్లు, వస్తువులు లోడింగ్, చెత్త ఏరుకోవడం, బూట్లు పాలిష్ చేయడం, పారిశ్రామిక యంత్రాల ఆపరేటింగ్, ఉప్పు, అద్దాల తయారీ పరిశ్రమలలోనూ కనిపిస్తున్నారు. చైల్డ్ ట్రాఫికింగ్ వలన అమ్మాయిలు వ్యభిచార వృత్తులలోకి, అబ్బాయిలు బిచ్చగాళ్లుగా మారుతున్నారు. కొన్ని కుటుంబాలలో సంపాదించే వ్యక్తులు తక్కువగా ఉండి, వారిపై ఆధారపడేవారు ఎక్కువగా ఉండటం, చిన్నప్పుడే తల్లిదండ్రులు మరణించడం, రోడ్ల మీద వదిలివేయబడిన పిల్లలు, తప్పిపోయిన పిల్లలు, తల్లిదండ్రులలో కొందరు పిల్లలతో పనికోసం వలసలు వెళ్ళడం వల్ల బాలలు విద్యకు దూరమవుతున్నారు. వ్యవసాయానికి తోడుగా పిల్లలను ఉంచుకోవడం వంటి అనేక కారణాలు చిన్నారులను బాలకార్మికులుగా మారుస్తున్నాయి.

వినాశకరమైన పరిణామాలు- తరతరాల బాధలు:
వ్యక్తిగత బాధల వెనుక, బాలకార్మికుల వల్ల తీవ్రమైన సామాజిక పరిణామాలు కూడా ఉన్నాయి. ఇది విద్య, రక్షణ, సురక్షిత వాతావరణానికి సంబంధించిన ప్రాథమిక మానవ హక్కులను ఉల్లంఘిస్తుంది. ఇది పేదరికం, అసమానతలను పెంచుతుంది. ఎందుకంటే పిల్లల స్వల్ప ఆదాయం కుటుంబాలను కేవలం ఆకలి నుండి కాపాడటానికి మాత్రమే సరిపోతుంది. ఇది నిజమైన ఆర్థిక అభివృద్ధికి అడ్డుపడుతుంది. పిల్లలు ఆటపాటలు, సామాజిక సంకర్షణ, భావోద్వేగ అభివృద్ధికి దూరంగా ఉండటం వల్ల సామాజిక నిర్మాణం బలహీనపడుతుంది. ఇది మానసిక గాయాలకు, సామాజిక అసమతుల్యతకు దారితీయవచ్చు. మారిన కాలానికి అనుగుణంగా విద్య నేర్చుకోకపోవడం వలన పనిచేసే రంగంలో నాణ్యతను కోల్పోయి అక్కడి నుండి నెట్టబడి నిరుద్యోగులుగా తయారవుతున్నారు. తరువాత వీరికి ఉపాధి దొరకక దొంగలుగా, స్మగ్లర్లుగా, గూండాలుగా, మాఫియా ముఠా సభ్యులుగా మారుతున్నారు. అసంఘటిత రంగంలో పనిచేసే వారికి హక్కులు, కనీస వసతులు ఉండవు. శ్రమ దోపిడీకి గురై కష్టానికి తగిన వేతనం లభించదు. సామాజిక భద్రతా చర్యలు వర్తించవు. పని పరిస్థితులు భయంకరంగా ఉంటాయి. జాతీయ స్థాయిలో, బాలకార్మిక సమస్య భారీ మానవ వనరుల నష్టాన్ని సూచిస్తుంది. విద్య, నైపుణ్యాభివృద్ధికి నోచుకోని శ్రామిక శక్తి తక్కువ ఉత్పాదకత, తగ్గిన ఆవిష్కరణలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పోటీ పడే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. ఇది భారతదేశం తన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను (ఎస్డిజి 8.7) సాధించడంలో దాని జనాభా డివిడెండ్‌ను సాకారం చేయడంలో నేరుగా అడ్డుపడుతుంది. బాలకార్మికుల దీర్ఘకాలిక శారీరక, మానసిక ప్రభావాలను పరిష్కరించడానికి ఆరోగ్య సంరక్షణ, సామాజిక సంక్షేమ వ్యవస్థలపై పెరిగిన భారం జాతీయ వనరులను మరింత తగ్గిస్తుంది. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యం 8.7ని సాధించడానికి ప్రపంచ దేశాలు 2025 నాటికి బాలకార్మికులను నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. కాని ఇవే పరిస్థితులు కొనసాగితే ఈ లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యం.

బాలల హక్కులు, ప్రభుత్వ ప్రయత్నాలు:
అంతర్జాతీయ మానవహక్కుల సంస్థ ప్రకారం లింగ, జాతి, మతం, కులం, హెూదాలతో సంబంధం లేకుండా పిల్లలందరికీ విద్యను అందజేయాలి. పిల్లలకు వారికి నచ్చిన రంగంలో చదువుకునే అవకాశం ఉండాలి. ఇంకా జీవించే హక్కు, ఆర్థిక, సామాజిక, పర్యావరణ, అభివృద్ధి హక్కులు కల్పించింది. అయితే, వీటిని బాలలకు అందజేయడంలో ప్రపంచ దేశాలు కేవలం కాగితాలకే పరిమితమై విఫలమయ్యాయి. ఇక మన దేశంలో రాజ్యాంగం బాలలకు పలు కీలక హక్కులను కల్పించింది. ఆర్టికల్ 14 లో సమానత్వ హక్కు, ఆర్టికల్ 15 లో వివక్షతకు వ్యతిరేకంగా ఉండే హక్కు, ఆర్టికల్ 21 లో వ్యక్తిగత జీవించే హక్కు, ఆర్టికల్ 21 (ఎ) లో ఆరు సంవత్సరాల నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలందరూ నిర్బంధ ఉచిత విద్యను పొందే హక్కు, ఆర్టికల్ 23 లో శ్రమ దోపిడీ నుండి రక్షించబడే హక్కు, ఆర్టికల్ 24 లో 14 సంవత్సరాల వయస్సు లోపు గల చిన్నపిల్లల చేత పరిశ్రమలలోనూ, గనులలోనూ, ఇతర ప్రమాదభరిత ఉత్పత్తి ప్రక్రియలలోనూ పనిచేయించరాదని, ఆర్టికల్ 45 లో పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అందించడం వంటివి ఇందులో ఉన్నాయి. అలాగే బాల కార్మిక వ్యతిరేక చట్టం 1986 ని తీసుకువచ్చింది. జాతీయ బాల కార్మిక ప్రాజెక్ట్ క్రింద అనేక చర్యలు తీసుకుంది, ప్రత్యేక పాఠశాలలను తెరిచింది. ఇప్పుడు ఎన్సివిల్పి సమగ్ర శిక్షా అభియాన్‌లో విలీనమైంది. పెన్సిల్ ( ప్లాట్ఫామ్ ఫర్ ఎఫెక్టివ్ ఎన్ఫోర్మెంట్ ఫర్ నో చైల్డ్ లేబర్ ) పోర్టల్ (2017లో ప్రారంభం) కూడా అమలును బలోపేతం చేస్తుంది. ఈ ప్రయత్నాలన్నీ కొంతవరకు బాలకార్మికుల సంఖ్యను తగ్గించాయి.




**కింజరాపు అమరావతి**
**8247286357**

# హెచ్.ఎం. రెడ్డి: తెలుగు సినిమా ఆద్యుడు


**హనుమప్ప మునియప్ప రెడ్డి జయంతి**

**తెలుగు సినిమా చరిత్రను పరిశీలించిన ప్రతీసారీ ముందు కనిపించే వ్యక్తిత్వం హెచ్.ఎం. రెడ్డి హనుమప్ప మునియప్ప రెడ్డి. ఆయన తెలుగు సినిమాకు శబ్దాన్ని ఇచ్చిన దర్శకుడు, తొలి టాకీ చిత్రానికి దర్శకుడు, నిర్మాణానికి పునాదులు వేసిన విజనరీ. 1892 జూన్ 12న మద్రాసు ప్రెసిడెన్సీ లోని అనంతపురం జిల్లా చిత్తంపల్లి గ్రామంలో జన్మించిన ఆయన, బాల్యంలో నుంచే నాటకాలపై మక్కువ కలిగి, అనంతపురంలో విద్యాభ్యాసం పూర్తిచేశారు. తరువాత ముంబైకి వెళ్లిన హెచ్.ఎం. రెడ్డి, అక్కడి రాయల్ టర్ఫ్ క్లబ్‌లో ఉద్యోగం చేస్తూ, సినిమాలపై ఆసక్తిని పెంచుకున్నారు. కొల్హాపూర్‌లో బాబురావు పెయింటర్ వద్ద దర్శకత్వ విద్యాభ్యాసం పూర్తి చేసిన అనంతరం, బొంబాయిలో అర్దేషీర్ ఇరానీ స్థాపించిన ఇంపీరియల్ ఫిలిం కంపెనీలో చేరి, స్క్రిప్టింగ్, సహాయ దర్శకత్వంలో అనుభవాన్ని సంపాదించారు.**

భారతదేశ తొలి టాకీ చిత్రం “ఆలం ఆరా” (1931) విజయాన్ని చూసిన వెంటనే, తెలుగులో కూడా టాకీ చిత్రాన్ని తీసే సంకల్పంతో ఆయన ముందు కొచ్చారు. ధర్మవరం రామకృష్ణమా చార్యుల రచన ఆధారంగా, ముంబైలోని ఇంపీరియల్ ఫిలిం కంపెనీ భాగస్వామ్యంతో 1931లో “భక్త ప్రహ్లాద” చిత్రాన్ని నిర్మించి, దర్శకత్వం వహించారు. సెప్టెంబరు 15న విడుదలైన ఈ చిత్రం తెలుగు సినీ చరిత్రలో ఓ శాశ్వత స్థానాన్ని సంపాదించగా, హెచ్.ఎం. రెడ్డి పేరు తొలి తెలుగు టాకీ దర్శకుడిగా చరిత్రలో మిగిలి పోయింది.



ఆయన చిత్రాలు పౌరాణికం నుంచి సామాజిక అంశాల వరకు విస్తరించాయి. “ద్రౌపదీ వస్త్రాపహరణం” (1936) వంటి పౌరాణిక చిత్రాలతో పాటు, “ఇలవేలుపు” (1951), “నిర్దోషి” (1951), “ఎవరు దొంగ” (1961), “పూజ” (1967) వంటి సామాజిక చిత్రాలతోనూ ఆయన విలక్షణతను చూపించారు. కథన శైలిలో లోతు, పాత్రలలో సజీవత, సాంకేతిక నైపుణ్యంలో చాతుర్యం ఆయన దర్శకత్వాన్ని ప్రత్యేకంగా నిలిపాయి. కమలాకర



కామేశ్వరరావు, సదాశివ బ్రహ్మం, కొండముది గోపాల రాయ శర్మ, మల్లాది వెంకటకృష్ణ శర్మ, కొవ్వలి, భమిడిపాటి కామేశ్వర రావు, శ్రీశ్రీ - ఇలా ఎందరో మహామహులను వెండి తెరకు పరిచయం చేసిన ఘనులు హెచ్.ఎమ్.రెడ్డి
కేవలం సినిమాలు తీయడమే కాకుండా, పరిశ్రమకు మౌలిక నిర్మాణాన్ని కల్పించాలన్న లక్ష్యంతో 1947లో చెన్నైలో “రోహిణి పిక్చర్స్” అనే తొలి తెలుగు నిర్మాణ సంస్థ స్థాపించారు. ఈ సంస్థ ద్వారా పలు ప్రతిభావంతులను తెలుగు సినీ ప్రపంచానికి పరిచయం చేశారు. తరువాతి రోజుల్లో వచ్చిన బి.ఎన్. రెడ్డి, కె.వి. రెడ్డి, ఎల్.వి. ప్రసాద్ వంటి దర్శకులపై ఆయన ప్రభావం స్పష్టంగా కనిపించింది. మద్రాసులో రోహిణి స్టూడియో కట్టారు. ప్రయోగాలు చెయ్యడంలో కూడా హెచ్.ఎమ్.దిట్ట. అంతవరకూ విలన్ వేషాలే వేస్తున్న ముక్కామలని నిర్దోషిలో హీరోని చేశారు. వాంప్ వేషాలు ఎక్కువగా వేసిన అంజలీ దేవిని నిర్దోషి (1951) తో హీరోయిన్‌ని చేశారు. నిర్దోషిలో ఓ చిన్నవేషంలో కనిపించిన కాంతారావుని ప్రతిజ్ఞతో హీరోని చేశారు. అలాగే ప్రతిజ్ఞలో విలన్ రాజనాలకు అదే తొలిచిత్రం.సినిమాను కేవలం వినోదంగా కాకుండా, సమాజంలోని సమస్యలపై చైతన్యం కలిగించే మాధ్యమంగా ఆయన అభివృద్ధి చేశారు. పాత్రలలో తాత్వికత, కథలలో సందేశాత్మకత, దృశ్యాలలో నైతికతను సమపాళ్లలో మిళితం చేసి ప్రేక్షకుల మనస్సుల్లో స్థిరమైన ముద్రవేశారు.హెచ్.ఎం. రెడ్డి 1960 జనవరి 14న కన్ను మూశారు. కానీ ఆయన సేవలు, భవిష్యత్ తెలుగు సినిమాకు పునాదులుగా నిలిచిన మార్గదర్శకత్వం, ఆయన సినిమాల్లో ప్రతిఫలించిన విజ్ఞాన దృష్టి, నేటికీ సినీ చరిత్రలో జీవించిపోతున్నాయి. తెలుగు చలనచిత్రం రూపు దిద్దుకున్న దశలో ఆయన చూపిన దిక్సూచి, నేటి తెలుగు సినీ రంగపు శక్తివంతమైన వ్యవస్థకు మూలస్తంభంగా నిలిచింది.తెలుగు సినిమా పితా మహుడు అనిపించుకున్న హెచ్.ఎం. రెడ్డి కళా తపస్సు, సంకల్ప బలం, సాంకేతిక సాహసాన్ని మరవ లేము. ఆయన పాటించిన మార్గం, చూపిన దారిలోనే తెలుగు సినిమా వృద్ధి చెందింది. ఆయన ఆవేశం, ఆలోచన, ఆరాధన %-% ఇవన్నీ కలిసిన రూపమే నేటి తెలుగు సినిమా మహా సాగరం.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్..**
**.9440595494**